క్లుప్తంగా

బీసీలకు కేటాయించాలి

జడ్చర్ల టౌన్: రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో బూర్గుపల్లి పంచాయతీని బీసీ జనరల్‌కు కేటాయించాలని గ్రామ యువకులు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌ఓ రవికుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. పంచాయతీ ఏర్పడి మూడు దశాబ్దాలు దాటినా ఇప్పటివరకు బీసీలకు అవకాశం దక్కలేదని అన్నారు. బీసీసేన మండల ప్రధాన కార్యదర్శి నర్సింహులు, గ్రామ యువకులు కన్నయ్య, కురుమూర్తి, రాజు, వినోద్ తదితరులు ఉన్నారు.

ఎస్‌ఐగా శ్రీకాంత్

కోయిల్‌కొండ: మండల ఎస్‌ఐ రాఘవేందర్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎస్‌ఐగా శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

అధ్యక్షుడిగా కైలాస్ జవహార్

జడ్చర్ల టౌన్: లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా కైలాస్ జవహర్ ఎన్నికైనట్లు క్లబ్ ప్రోగ్రాం చైర్మన్ డా. వి.రాంరెడ్డి తెలియజేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం అధ్యక్షుడి ప్రమాణస్వీకారం ఉంటుందని తెలిపారు. కార్యదర్శిగా డా.సుజీత్‌కుమార్, కోశాధికారిగా పి. బుచ్చయ్యలు సైతం ప్రమాణస్వీకారం చేస్తారని వెల్లడించారు. లయన్ విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతారని వివరించారు.

ఆర్థిక సాయం

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లికి చెందిన గుడిసె చిన్న బూసన్న అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి రూ.5వేలను పంపడంతో వారికి అందజేశారు. అదేవిధంగా బీపీఎల్ ఫౌండేషన్ ద్వారా రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎంపీటీసీ గణేష్, వెంకట్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మొగులయ్య, శ్రీధర్, దేవరాజు, మన్నెం, కురుమూర్తి, శ్రీనివాసులు, నర్సింహ్మ ఉన్నారు.

సన్మానాలతో సరి



మిడ్జిల్: మండల సమస్యలపై చర్చించుటకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం ఎంపీపీ సుదర్శన్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీ కాలం ఈనెల 4తో ముగియనుండడంతో సమావేశంలో ఎలాంటి చర్చా నిర్వహించలేదు. సన్మానాలతో ముగించేశారు. జెడ్పీటీసీ శశిరేఖా, ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీఓ అనురాధ, వైస్‌ఎంపీపీ తిరుపతమ్మ, ఎంపీటీసీలు గౌస్, రాజారెడ్డి, నర్సింహ్మా, యశోద, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ



జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు స్నేహఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్‌బ్యాగులు, నోట్‌పుస్తకాలు అందజేశారు. మేనేజర్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివే గ్రామీణప్రాంత విద్యార్థులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనంతప్ప, ఉపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లస్వామి, రవి, మధుసూదన్‌రెడ్డి, జరీనాబేగం, జ్యోతి, తిరుపతిరెడ్డి, షర్మిల పాల్గొన్నారు.

చిన్నారుల భావాలకు అనుగుణంగా బోధించాలి

జడ్చర్ల టౌన్: చిన్నారుల ఆలోచనలు, భావాలకు అనుగుణంగా ప్రీస్కూల్‌లో బోధన చేయాలని సీడీపీఓ మెహరున్నీసాబేగం పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేడ్కర్ కళా భవన్‌లో జరుగుతున్న అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ 2వరోజు ఆమె చిన్నారుల బోధనలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు సునీత, పద్మాంజలి, అరుణజ్యోతి, రాజ్యలక్ష్మి, టీచర్లు అంజనమ్మ, అలివేలు, శ్రీలత, భారతి, నాగమణి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

జడ్చర్ల: స్థానిక శ్రీనివాస నగర్‌కు చెందిన ప్రశాంతి(30) మంగళవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. ఆమె తండ్రి ప్రకాశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కర్వెనలో మరో మహిళ..

భూత్పూర్: కర్వెనకి చెందిన అమృత అదృశ్యమైందని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం ప్రకారం గ్రామానికి చెందిన విష్ణుకుమార్‌కు వట్టెంకు అమృతతో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి కుమారుడు (8), కుమార్తె (6) ఉన్నారు. కాగా కుటుంబ సంబంధ విషయాల నేపథ్యంలో అమృత ఇంట్లో చెప్పకుండ ఎక్కడికో వెళ్లిపోయింది. సాయిప్రసాద్ అనే వ్యక్తిపై అనుమానం ఉందని చర్యలు తీసుకోవాలని మంగళవారం విష్ణుకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట



కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: అన్ని వర్గాల అభ్యున్నతి కోసం పని చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల పరిధిలోని 42 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం పూర్తిగా అప్పుల కుప్పగా మారిందని, అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సారథ్యంలో కల్యాణలక్ష్మికి సంబంధించిన చెక్కులకు ఏ విధమైన ఆటంకం కలుగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఏ తల్లి, తండ్రి కూడా ఆడబిడ్డలకు పెళ్లి చేసి అప్పుల పాలు కాకూడదనే మంచి ఆలోచనతో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందిస్తున్నట్లు వివరించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ల విషయంలో ఎవరైనా డబ్బులు అడిగితే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోని తమ సిబ్బందికి తెలియజేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఎన్నో సంక్షేమ పథకాలు మహిళల కోసం తీసుకొస్తుందని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుందర్‌రాజ్, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, జమిస్తాపూర్ ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, మాజీ సర్పంచ్ గోవింద్‌యాదవ్, నాయకులు నర్సింహారెడ్డి, మేఘారెడ్డి, మాధవరెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: రైతులు ఆధునిక యంత్రాలను వ్యవసాయంలో వినియోగించాలని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం అల్లిపురంలో యువరైతు సాయికుమార్ తీసుకవచ్చిన డ్రోన్ స్ప్రే(పురుగుల మందు పిచికారి యంత్రం)కు పూజలు నిర్వహించి ప్రారంభించారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అప్పంపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, దామోదర్, కృష్ణయ్య, విష్ణుచారి, బాలవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని నాయకులు అన్నారు. ఈ మేరకు ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఏఓ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. బకాయిలను విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కోర్సులు పూర్తి అయినా కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్‌లు ఇవ్వకపోవడం వల్ల నష్టపోతున్నారన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, సురేష్, రాఘవేందర్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేయవద్దని ఆందోళన



రిజిస్ట్రేషన్‌ను అడ్డుకోడానికి వచ్చిన జీనుగరాల వాసులు

దేవరకద్ర: జీనుగరాలలో తమ వాటా కింద రావలసిన భూమిని ఇవ్వకుండా అక్రమంగా అమ్ముకుని రిజిస్ట్రేషన్ చేస్తున్న సంగతి తెలిసి కొందరు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆందోళనకు దిగారు. భూభాగ పరిష్కారం చేయకుండానే అమ్ముకుంటున్నారని కార్యాలయంలోనే దాయాదులతో గొడవకు దిగారు. గ్రామానికి చెందిన కరిగేటి దేవన్న, కమలమ్మ, పార్వతమ్మలు భాగ పరిష్కారం అయ్యేవరకు రిజిస్ట్రేషన్ చేయవద్దని తహసీల్దార్‌ను కోరారు. సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామంలో పెద్దల ద్వారా వచ్చిన 19 ఎకరాల భూమి ఉందన్నారు. నలుగురు పేర పట్టా కావాల్సి ఉండగా ఒకరిద్దరు అక్రమంగా పట్టా చేసుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు తమకు తెలియకుండా అమ్ముకుని కొనుగోలుదారుని పేర రిజిస్ట్రేషన్ చేస్తున్నారని అన్నారు. మిగతా భూమిని తరువాత తమకు రిజిస్ట్రేషన్ చేస్తానని పట్టాదారు చెప్పినా.. నమ్మకం లేదంటూ గొడవ పడ్డారు. గొడవ పెద్దది కావడంతో తహసీల్దార్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు సదరు వ్యక్తులను స్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్‌ను వివరణ కోరగా భూమికి సంబంధించి బాధితులకు రెండు నెలల సమయం ఇచ్చామన్నారు. భాగ పరిష్కారం చేసుకోకుండా ఆందోళన చేయడంపై తమకు సంబంధం లేదన్నారు.

మాదిగల కుటుంబాలకు రూ.12 లక్షలు ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: అంబేడ్కర్ అభయ హస్తం కింద ప్రతిమాదిగ కుటుంబానికి రూ. 12 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ కళాభవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 2009 విద్యాహక్కు చట్టం అమలు పరచాలని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులను రెగ్యులరైజేషన్ చేసి, మాదిగ సంఘాల ఉద్యమకారులకు 250 గజాల స్థలం కేటాయించాలని కోరారు. వికలాంగుల పెన్షన్‌ను రూ. 7 వేలకు పెంచాలని, సదా లక్ష్మమ్మ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై పెట్టాలని డిమాండ్ చేశారు. డప్పు కొట్టే, చెప్పు కుట్టే మాదిగలకు రూ. 5వేల పెన్షన్ ఇవ్వాలని అన్నారు. ఈనెల 10న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సదస్సు ఉంటుందని, ఈ సదస్సుకు టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండి బాలరాజు, జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, టీవీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నర్సిములు, జిల్లా అధ్యక్షుడు రాజు, నాయకులు మెట్టు అంజమ్మ, మాసయ్య, మహేశ్వర్, వెంకటయ్య, తిరుపతయ్య, ప్రవీణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్స్, డీఎస్సీ పోస్టులు పెంచాలి



అడ్డాకులలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



దేవరకద్రలో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బీజేవైఎం నాయకులు

సాక్షినెట్‌వర్క్: నిరుద్యోగుల సమస్యలపై జిల్లావ్యాప్తంగా ఆయా మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట బీజేవైఎం, బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. మెగా డీఎస్సీ, గ్రూప్స్‌లో పోస్టుల పెంపుపై తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. అడ్డాకులలో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు అరవింద్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చన్నయాదవ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. రాఘవేందర్‌రెడ్డి, యశ్వంత్, నరేందర్, సాయిరాం, సల్మాన్, పవన్‌సాగర్, శశాంక్, విజయ్ తదితరులు ఉన్నారు.

జడ్చర్లలో బీజేవైఎం మండల శాఖ అధ్యక్షుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. మధుగౌడ్, మహేశ్, కుమార్, నవీన్, శివ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేటలో తహసీల్దార్ నాన్యనాయక్‌కు వినతి పత్రం అందించారు. శివ, యాదయ్య, శ్రీనివాస్, రవి, తిరుపతి, వెంకటేష్, రమేష్ తదితరులు ఉన్నారు.

గండేడ్‌లో బీజేపీ అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు టైగర్ రవీంద్ర తదితరులు తహసీల్దార్ నాగలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. మహమ్మదాబాద్‌లో మండలాధ్యక్షుడు కుర్వ కృష్ణ తదితరులు తహసీల్దార్ తిరుపతయ్యకు వినతి పత్రం సమర్పించారు.

దేవరకద్రలో బీజేపీ యువమోర్చా నాయకులు తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. మండల కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

బాలానగర్‌లో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కుమార్, భాస్కర్, చారి, వేణు పాల్గొన్నారు.

మిడ్జిల్‌లో తహసీల్దార్ రాజునాయక్ వినతిపత్రం ఇచ్చారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, లాలు, నరేష్, అంజి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

కేశ్వాపూర్‌లో డ్రెయినేజీ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న గ్రామస్తులు

కోయిల్‌కొండ: మండలంలోని కేశ్వాపూర్‌లో మంగళవారం డ్రెయినేజీ పనులను ఎంపీటీసీ శ్రీధర్ కిశోర్ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు రెండు రూ.లక్షలతో 7వ వార్డులో పనులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మెగులయ్య, గొల్లనర్సమ్మ, సాయిలు, నరేష్, దేవరాంనాయక్, రాములు, మల్లికార్జున్, శివరాజ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చైన్ సప్లైపై అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో చైన్ సప్లైపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. రవాణా, నీరు, రోడ్డు మార్గంలో వస్తువుల సప్లైపై వివరించారు. ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, కృష్ణయ్య, అర్జున్‌కుమార్, నాగసుధ పాల్గొన్నారు.

పుస్తకాల అందజేత

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నోటుపుస్తకాలను, పెన్సిల్లు, రబ్బర్లు, భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిషోర్, దిలీప్, భూషణ్‌పాండే, పాండురంగం, రమేష్‌చందర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు: ట్రస్మా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రైవేటు పాఠశాలల్లో చదివి ఎస్సెస్సీ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందిస్తామని ట్రస్మా అధ్యక్షుడు ప్రభాకర్ పేర్కొన్నారు. ఈమేరకు ట్రస్మా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 10 నుంచి 9 జీపీఏలు సాధించిన వారి వివరాలను జిల్లా కేంద్రంలోని నవభారతి పాఠశాలకు పంపిచాలన్నారు. కార్యక్రమంలో రాఘవేందర్, అంజిరెడ్డి, రూపావతి, భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ అప్పగింత

దేవరకద్ర: పెద్దరాజమూర్‌కి చెందిన మహమూద్ మూడు నెలల క్రితం మొబైల్ పోగొట్టుకోగా రికవరీ చేసి మంగళవారం అతడికి అందజేసినట్లు ఎస్‌ఐ నాగన్న తెలిపారు. దేవరకద్ర కూరగాయల సంతలో అతడు ఫోన్ పోగొట్టుకున్నాడని వివరించారు. తమకు ఫిర్యాదు చేయడంతో ట్రేస్ చేసి రికవరీ చేశామని తెలిపారు.

అభిప్రాయ సేకరణ



కోయిల్‌కొండ: రైతు భరోసాపై మంగళవారం అభిప్రాయ సేకరణ చేపట్టినట్లు సింగిల్ విండోచైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గార్లపహాడ్ రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో రైతుల నుంచి సూచనలు తీసుకున్నట్లు వివరించారు. వ్యవసాయాధికారి రాంపాల్, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ ఆంజనేయులు, డైరెక్టర్లు శ్రీపాద్, ఆశన్నగౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

హన్వాడ: పంచాయతీ కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ వేతనాలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని.. పారిశుద్ధ్య కార్మికుల సంఘం అధ్యక్షుడు బాలకిష్టయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలో సమావేశం నిర్వహించారు. 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని అన్నారు. జిల్లా కార్యదర్శి వెంకట్‌రాములు, మండల కార్యదర్శి తిమ్మన్న, చెన్నయ్య, రాములు, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు ముందుకు రావాలి



గార్లపహాడ్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు

కోయిల్‌కొండ: గ్రామాల్లో మొక్కలను నాటేందుకు ప్రతిఒక్కరు ముందుకు రావాలని అడిషనల్ డీఆర్‌డీఓ ముసాయిదాబేగం అన్నారు. మంగళవారం గార్లపహాడ్, అభంగపట్నం గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. అనంతరం అభంగపట్నం గ్రామపంచాయతీలో ఉపాధిహామీ పనుల రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మొక్కలను పెట్టడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా ప్రతిఒక్కరు తీసుకోవాలన్నారు. మొక్కలను నాటడం ద్వారా అనేక లాభాలు ఉన్నాయన్నారు. అదేవిధంగా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులు సక్రమంగా నిర్వహించాలన్నారు. అడిగిన ప్రతి కూలీకి పనికల్పించేందుకు ఉపాధిహామీ అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ నర్సయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘అమ్మకు ప్రేమతో ఒక మొక్క’



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, వలంటీర్లు

జడ్చర్ల టౌన్: ప్రధాని మోదీ పిలుపు మేరకు ‘అమ్మకు ప్రేమతో ఒక మొక్క’ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక డిగ్రీ, పీజీ కళాశాల బొటానికల్ గార్డెన్‌లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 3 ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ మొక్కలు నాటి విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశం ఇచ్చారు. 6వేల పైచిలుకు మొక్కలను చెట్లుగా తీర్చిదిద్దిన ఘనత తమ కళాశాలకు ఉందన్నారు. గార్డెన్‌లో 50మంది వలంటీర్లు మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్య, అధ్యాపకులు లత, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కనులపండువగా గంధోత్సవం



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం ఎర్రకుంట సమీపంలోని బాదేషా బౌలిలోగల హజ్రత్ బర్హానే బాదేషా రహెమతుల్లా అలై దర్గా 254వ ఉర్సె షరీఫ్ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రధానఘట్టమైన గంధోత్సవం(సందల్ షరీఫ్) మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్థానిక వీరన్నపేటలోగల మక్కా మజీద్ నుంచి ఊరేగింపు ప్రారంభమై మదీనా మజీద్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ రోడ్, క్లాక్ టవర్, పాన్‌చౌరస్తా మీదుగా దర్గా వరకు నిర్వహించారు. నారే తగ్బీర్ నినాదాలతో గంధోత్సవ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గాలో పూలు, చాదర్లు సమర్పించి ప్రత్యేక ఫాతేహా ప్రార్థనలు చేశారు. రాత్రి ఖవ్వాలి (భక్తిగీతాలు) కార్యక్రమం నిర్వహించారు. ఉర్సు ఉత్సవాల్లో భాగంగా బుధవారం చిరాగా (దీపారాధన)తోపాటు ముషాయిరా (కవి సమ్మేళనం) కార్యక్రమం ఉంటుందని ముతవల్లీ డాక్టర్ గయాజ్‌పాష ఖాద్రీ హకం షర్ఫీ తెలిపారు. 4న ఉదయం 9 గంటలకు ఫాతేహా-ఖత్మే ఖురాన్‌తో దర్గా వేడుకలు ముగుస్తాయని తెలిపారు. సయ్యద్ చందా హుస్సేని, హఫీజ్ వారిస్ పాష ఖాద్రీ, జహంగీర్‌పాషా ఖాద్రీ, సైఫ్ ఖాద్రీ, యూసుఫ్ షర్ఫీ, నజీర్, సాబేర్, సాఖిబ్, సూఫియాన్, అనస్, అదీబ్, సయ్యద్ రేహాన్ హుస్సేని, సయ్యద్ ఫుర్ఖాన్ హుస్సేని, మహ్మద్ జకీ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న కార్మికులు

జడ్చర్ల టౌన్: ప్రభుత్వ ఆస్పత్రి కార్మికుల వేతనాల పెంపు డిమాండ్‌తో బుధవారం తెలంగాణ వైద్య విధాన పరిషత్ ముట్టడించనున్నట్లు.. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ స్పష్టం చేశారు. మంగళవారం జడ్చర్ల ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. సోమశేఖర్‌ను కార్మికులతో పాటు కలసి ధర్నా నోటీసును అందజేశారు. భోజన విరామ సమయంలో కార్మికులు కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. దేవానంద్, విజయలక్ష్మి, సుక్కమ్మ, యాదమ్మ, చెన్నమ్మ, పద్మ, కవిత, అలివేలు, లక్ష్మమ్మ, భార్గవి, నరసింహ్మా, శేఖర్, మల్లేష్ పాల్గొన్నారు.

పనుల పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణ పరిధిలో ఈనెల 5న వన మహోత్సవం ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తుగా వివిధ ప్రాంతాల్లో గుంతలను తవ్వుతున్నారు. కాగా, మంగళవారం పిల్లల మర్రి రోడ్డు, కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డు నుంచి హనుమాన్ టెంపుల్ తండా వరకు చేపట్టిన ఈ పనులను మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపాటికే గుర్తించిన ప్రాంతాల్లో ముందుగా పిచ్చి మొక్కలను తొలగించి చుట్టుపక్కల చదును చేయాలని సూచించారు. అనంతరం కోయిల్‌కొండ ఎక్స్ రోడ్డులోని డంపింగ్ యార్డుకు ఏర్పాటు చేస్తున్న అప్రోచ్ రోడ్డు పనులను తనిఖీ చేశారు. దీనిని అనుకొని భూత్పూర్-చించోలి జాతీయ రహదారి నిర్మిస్తున్న విషయం విదితమే. కార్యక్రమంలో ఏఈ సాయిరాం పాల్గొన్నారు.

దివ్యాంగుల పెన్షన్ రూ. ఆరువేలు చేయాలి

మాగనూర్: ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఆసరా పెన్షన్స్ పెంచుతామని ఇచ్చిన హామని వెంటనే అమలు చేయాలని రూ. 6 వేలు ఇవ్వాలని ఎన్‌పీఆర్డీ మండల అధ్యక్షుడు బాబు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తు జులై 3న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం ఉంటుందన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన వికలాంగులకు ఉచిత బస్‌సౌకర్యం, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ చేయాలని కోరారు. కాలపరిమితి ముగిసిన సదరం సర్టిఫికెట్స్ వెంటనే రెన్యూవల్ చేయాలన్నారు.

నేడు సర్వసభ్య సమావేశాలు

రాజాపూర్/నవాబుపేట: జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోని రాజాపూర్, నవాబుపేట మండలాల సర్వసభ్య సమావేశాలు బుధవారం నిర్వహించనున్నారు. కాగా తమ పదవీ కాలంలో ఆఖరి సర్వసభ్య సమావేశాలకు ఎంపీటీసీ సభ్యులు సిద్ధమవుతున్నారు. కాగా వారికి ఆది నుంచి అన్ని అవాంతరాలే అని చెప్పవచ్చు. కొంతకాలం కరోనా.. మరికొంత కాలం ఎన్నికల కోడ్లు వారిని వెంటాడుతూనే వచ్చాయి. ఇంతలోనే జులై 4న వారి పదవీ కాలం పూర్తి కానుండగా 3న ఆఖరి సభ జరగనుంది. దీంతో ఈ సభల్లో ఎలాంటి చర్చ జరుగుతుందనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు అలాంటివేమీ లేకుండా ఆఖరికి వీడ్కోలుతోనే మమ అనిపిస్తారా అనేది వేచిచూడాల్సి ఉంది.

తైబజార్ వేలం



రాజాపూర్: బాలానగర్ మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే వారాంతపు సంతకు మంగళవారం తైబజార్ వేలం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి బాబురావ్, ఎంపీడీఓ శరత్‌చంద్ర బాబు ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. బాలానగర్‌కు చెందిన బాలకిష్టమ్మ రూ. 5.47లక్షలకు వేలం దక్కించుకున్నారు. వచ్చే ఏడాది మార్చ్ వరకు ఆమె తైబజార్ నిర్వహించుకోవచ్చని అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నవాబుపేట: కాకర్లపహాడ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. నవాబుపేటకు చెందిన మల్లేష్ మరికల్‌లో ఎస్‌బీఐ బ్యాంక్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కాగా ఆయన జిల్లా కేంద్రానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో.. కాకర్లపహాడ్ సమీపంలో అతడు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. దీంతో మల్లేష్ కాలుకు, నడుము భాగంలో గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి ఆయనను ఆస్పత్రికి తరలించారు. అయితే ఎలాంటి ప్రాణహాని లేదని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించామని అతడి కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని నవాబుపేట పోలీసులు తెలిపారు.